జొన్నకు పురుగు బెడద



రాజుపాళెంలో పురుగు ఉధృతికి జొన్న కర్రలకు రంధ్రాలు (ఇన్‌సెట్) జొన్న పంటను ఆశిస్తున్న పచ్చ పురుగు

రాజుపాళెం : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన జొన్న పంటలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట ఏపుగా పెరగడంతో పాటు పచ్చగా కనిపిస్తోంది. లోపలికి వెళ్లి చూస్తే పంటంతా రంధ్రాలు వేసి నష్టం చేస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలోని గాదెగూడూరు, కూలూరు, టంగుటూరు, రాజుపాళెం, కొర్రపాడుతోపాటు పలు గ్రామాల్లో ఈ పంట విస్తారంగా సాగు చేశారు. వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి వివరణ కోరగా ఎకరా జొన్న పంటలో 6 నుంచి 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. అలాగే ఆ పురుగు ఉధృతి నివారణకు థయోడికార్బ్ లీటరు నీటికి ఒక గ్రాము, బారాజైడ్ 1.5 ఎంఎల్ లీటరు నీరు లేదా డెలిగేట్ లీటరు నీటికి 1ఎంఎల్ ఏదో మందును కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

వేమన పద్య పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : కడప రెడ్డి సేవా సమితి రజతోత్సవ వేడుక నిర్వహించడం సంతోషంగా ఉందని ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి తెలిపారు. కడప రెడ్డి సేవా సమితి రజతోత్సవ వేడుక సందర్భంగా ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో శనివారం వేమన పద్య పోటీలు నిర్వహించారు. స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజక వర్గాల పరిధిలోని 40 ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. నరాల రామారెడ్డి మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో రెడ్డి సేవా సంఘాన్ని ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ మూలె రామమునిరెడ్డి, శివప్రభాకర్‌రెడ్డి, పాలెం వేణుగోపాల్, డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ పల్లా కృష్ణ, గొర్రె వెంకటేష్ వ్యవహరించారు. వరుస విజేతలుగా నిలిచిన వై.శ్రీవాసవి, ఏవీ.కార్తిక, జి.సుమఅఖిలలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేశారు. 13 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలకు హాజరైన 700 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాధవ్ రెసిడెన్సీ యజమాని గంగిరెడ్డి మాధవరెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.నాగిరెడ్డి, డాక్టర్ మద్దిక సుబ్బిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్వీ రమణారెడ్డి, ఎస్.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడిపాడులో జిల్లాస్థాయి లగోరి ఎంపికలు



లగోరి పోటీలలో ఎంపికైన విద్యార్థులు

దువ్వూరు(చాపాడు) : మండల పరిధి గుడిపాడు గ్రామంలోని శ్రీ శంకరాచార్య హైస్కూల్‌లో శనివారం జిల్లాస్థాయి లగోరి ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్వేలి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని 10 పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొనగా జిల్లా లగోరి సెక్రెటరీ ఈర్ల సంజీవరాయుడు పర్యవేక్షణలో వనిపెంట జడ్పీ హైస్కూల్ పీఈటీ రామ్‌నాయక్ ఎంపికలు నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకులయ్య, కమలాక్షమ్మ ఆరాధన మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉదయం శ్రీకృష్ణుడికి, మళయాల స్వామి, ఎరుకలయ్య, కమలాక్షమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆశ్రమ ప్రాంగణంలోని వేదికపై నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు నాట్యవిశారద మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, సిబ్బంది విజయ్, జనార్దన్‌రెడ్డి, శారద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్ బాబు రెడ్డి, ఆశ్రమంలోని విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రస్ పోటీలలో పాల్గొన్న చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక సాయి కుటీర్ రోడ్డులోని గౌతమ్ హైస్కూల్ చిన్నారులకు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు శనివారం నిర్వహించారు. 175 మంది చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలకు 14వ తేదీన బహుమతులు అందిస్తామని కరస్పాండెంట్ సుధీర్ తెలిపారు. ఇంద్రాణి, డైరెక్టర్ మునిస్వామినాయుడు, మునిలక్ష్మమ్మ, హర్షప్రియ, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథకు వృద్ధాశ్రమంలో ఆశ్రయం



అనాథను ఆశ్రమానికి తీసుకెళుతున్న రామకృష్ణారెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఎండకు, వానకు తడుస్తూ రోడ్డుపై ఉంటున్న అనాథ మహిళను శనివారం వివేకానంద సేవాశ్రమ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి గుర్తించి ఆమెను తమ సేవాశ్రమానికి తీసుకెళ్లారు. ఆమె ఎక్కడ నుంచి వచ్చిందో, పేరేమిటో తెలియదు. ఆమెకు తెలుగు రాదు. దీనస్థితిలో ఉన్న అభాగ్యురాలిని వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. ఎక్కడ అనాథలు కనిపించినా, అయినవారి ఆదరణ కరువై అలమటిస్తున్నా, వృద్ధాప్యంలో జీవనానికి తల్లడిల్లుతున్న వారి సమాచారం తెలిపితే తమ ఆశ్రమంలో అన్ని వసతులతో ఉచిత సేవలందిస్తామని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 889729237 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ రవిబాబు

పోరుమామిళ్ల : మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రవిబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది పనితీరు, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం పరిశీలించారు. ల్యాబ్, కాన్పుల గది పరిశీలించారు. గర్భిణులకు పోషకాహారం గురించి తెలియజేసి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ప్రభుత్వ సేవల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల, ఆరోగ్య విద్యాధికారులు సాధు వెంకటేశ్వర్లు, సరస్వతి, నాగమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

బద్వేలు అర్బన్ : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శనివారం బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 80 మందికి పైగా మహిళలు పాల్గొని వివిధ రకాల ఆకృతులలో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా బలిజసేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, కొర్రపాటిసురేంద్రలు మాట్లాడుతూ బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న కార్తిక వనభోజనాల కార్యక్రమం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. నేటి ఆధునిక ప్రపంచంలో ప్రాచీన కళలు అంతరించిపోతున్న తరుణంలో సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించి సంప్రదాయాలను గుర్తింపచేయడమే తమ అభిమతమన్నారు. విజేతలకు వనభోజనాల కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బలిజసేవా సంఘం నాయకులు కొంకులరాంబాబు, తోటరాము, నాగార్జున, వెంకటసుబ్బయ్య, శ్రీను, పెద్దిసుధాకర్, హరిక్రిష్ణ, గంపాకొండయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి

బద్వేలు అర్బన్ : చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి, పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రతి కోర్టులో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను ముద్రించి గ్రామాల్లో పారాలీగల్ వలంటీర్ల ద్వారా, కోర్టు సిబ్బంది ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అట్లూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బద్వేలు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మ్యాజిస్ట్రేట్ గాయత్రి పేర్కొన్నారు. శనివారం ఆమె కొండూరు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించాలని, సమస్యల జోలికి వెళ్లకూడదన్నారు. ఇదివరకే ఏవైనా కేసులు ఉంటే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఎస్ఐ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్, చంద్రా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్సీఎం చర్చి వేడుకలు



మాట్లాడుతున్న ఖమ్మం బిషప్ సగిలిప్రకాశం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న పునీత యోహాను (ఆర్సీఎం) చర్చి జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కడప బిషప్ గాలిబాలిని స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి చర్చి వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం గురుపుంగవులతో కలిసి కడప, ఖమ్మం బిషప్‌లు దివ్యబలిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప, ఖమ్మం బిషప్‌లు గాలిబాలి, సగిలిప్రకాశంలు మాట్లాడుతూ ఆర్సీఎం చర్చి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో చర్చి అభివృద్ధికి ఫాదర్ మనోహర్ కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా కుల, మత, వర్గ, వర్ణ, విచక్షణ భేదం లేకుండా శాంతి మార్గంలో నడుచుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత భజన పుల్లయ్య వేసిన చెక్కభజన అందరిని అలరించింది. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

హైందవ శంఖారావం కార్యవర్గం ఎన్నిక



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమం జయప్రదం చేసేందుకు గాను కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక సరస్వతి శిశుమందిరంలో విశ్వహిందూ పరిషత్ బద్వేలు ఖండ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత ధర్మాచార్య ప్రముఖ్ రామమహేష్, జిల్లా ప్రచార ప్రముఖ్ మురళీమనోహర్‌రెడ్డిలు మాట్లాడుతూ దేవాదాయ ధర్మశాఖపై ప్రభుత్వ పెత్తనం తొలగించాలని, దేవాదాయశాఖలో అన్యమత ఉద్యోగులను తొలగించాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కన్వీనర్‌గా కొండపల్లి వెంకటసుభాష్‌కుమార్, కో కన్వీనర్‌గా సాకిఈశ్వరయ్య, నిధి ప్రముఖ్ సంజీవరెడ్డి, రవాణా ప్రముఖ్ శివరామిరెడ్డి, సోషల్ మీడియా ప్రముఖ్ నరసింహులు, మీడియా ప్రముఖ్ రామయ్య, ప్రచార సామగ్రి వితరణ ప్రముఖ్‌లుగా నరసింహులు, క్రిష్ణయ్య, గౌరవ సభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి, రఘునాధరెడ్డి, కిరణ్‌కుమార్, సురేష్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, సుధాకర్, శ్రీను, వెంకటశివానంద, నరసింహప్రసాద్, వెంకటయ్య నియమితులయ్యారు. కార్యక్రమంలో రామకోటిరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : జిల్లాలో దళితుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి అధికార ప్రతినిధి ఎం.పిచ్చయ్య, సీనియర్ దళిత నాయకులు జి.కేశవయ్య డిమాండ్ చేశారు. శనివారం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లేకపోవడం వలన దళితుల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని వీలైనంత త్వరగా జిల్లా స్థాయి, డివిజన్ స్థాయిలలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శిఖామణి, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, చంద్రశేఖర్, సుబ్బయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కడప సెంట్రల్ జైల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ

కడప కార్పొరేషన్, మైదుకూరు : కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మైదుకూరు మండలం, పెద్దశెట్టిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరాం, వైఎస్సార్‌సీపీ మండల నేత నేట్లపల్లె రామాంజనేయులును వైఎస్సార్ సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వారి బంధువులతో కలిసి శనివారం పరామర్శించారు. తమకు ఎలాంటి సంబంధంలేని కేసుల్లో అక్రమంగా తెదేపా నేతలు ఇరికించారని వారు రెడ్యం దృష్టికి తెచ్చారు. మీరు ధైర్యంగా ఉండాలని రెడ్యం వారికి చెప్పారు. పరామర్శించిన వారిలో శివరాం భార్య గీత సౌజన్య, రామాంజనేయులు భార్య భాగ్యజ్యోతి, కమలాపురం నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆదిమూలం వెంకటశివయ్యయాదవ్, ఖాజీపేట మండల నేత మల్లె ఓబయ్యయాదవ్‌లు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తిక మాసం రెండవ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



వెంకటేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామికి, లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఆలయానికి చేరుకుని కుంకుమార్చన నిర్వహించారు. పసుపు, కుంకుమ, దీపాలతో అర్చించారు. విష్ణ సహస్రనామ పారాయణం చేశారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు క్రైం: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నల్లబల్లె హిమబిందు తెలిపారు. పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌లో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, ఎస్‌యూఓ సాధు శ్రీనివాసులు ఉమాదేవి, మనోరాణి, ఎంపీ.సుబ్బారెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

కాలువలో పడిన లారీ

పోరుమామిళ్ల: విశాఖపట్నం నుంచి కడపకు యూరియా తీసుకొని వెళుతున్న లారీ శనివారం తెల్లవారుజామున పోరుమామిళ్లకు 4 కిలోమీటర్ల దూరంలో చింతలపల్లె దగ్గర అదుపు తప్పి రోడ్డు పక్క కాలువలో పడిపోయింది. డ్రైవర్ వేగంగా నడుపుతూ మలుపులో కంట్రోలు చేసుకోలేక పోవడంవల్లే లారీ బోల్తా పడినట్లు తెలుస్తోంది. తెల్లవారు జామున నిద్రమత్తులో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 29 మందికి ల్యాబ్‌లో అన్ని పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు 4వ నెల నుండి 9వ నెల వరకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆసుపత్రిలో వైద్యులచే పరీక్షించి వారు సురక్షితంగా ప్రసవం జరిగేలా చూడాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

దువ్వూరు(చాపాడు) : గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి యశస్విని తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న గర్భిణులు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి నెలా 9న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను ఇస్తారన్నారు. గర్భిణులు ప్రతి నెలా ఎత్తు, బరువు, హెచ్‌బీ గ్రూపింగ్, రక్త, యూరిన్, అల్బుమిన్, షుగర్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవటంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వండి



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్ శివజ్యోతి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులకు అయ్యే ఖర్చులపై అంచనా వేసి ఇంజినీరింగ్ అధికారులు నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆదేశించారు. మున్సిపాలిటీలోని 33వ వార్డులో స్థానిక కౌన్సిలర్ గాజుల శివజ్యోతితో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఎస్వీఎస్ హైస్కూల్ నుంచి మక్కా మసీదు వరకు ఎన్‌క్రోచ్‌మెంట్ రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారుచేయాలని కమిషనర్ సూచించారు. మక్కా మసీదు వద్ద గ్రిల్స్‌కు మరమ్మతులు చేయాలని తెలిపారు. మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, మక్కా మసీదుకు సంబంధించి మైనర్ రిపేర్లు చేసేందుకు అంచనాలు తయారు చేయాలన్నారు. వినాయకనగర్ మోటు నుంచి దేవాంగపేట కల్యాణమండపం వరకు సీసీ రోడ్డు, మురికి కాలువకు సంబంధించి అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ప్రముఖ విద్యావేత్త సుబ్బారెడ్డి మృతి



సీవీఎన్ సుబ్బారెడ్డి(ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సీవీఎన్ జసుబ్బారెడ్డి(91) స్థానిక హౌసింగ్ బోర్డులోని తన నివాసంలో శనివారం మృతి చెందారు. ఈయన రాజుపాళెం మండలం తొండలదిన్నెలో 1934 జులై, 1న నారపురెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. ఈయన 1973 నుంచి 1989 వరకు కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల డీఈఓగా పనిచేశారు. 1982 నుంచి 1989 వరకు అడల్ట్ సెక్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా, నవోదయ జాయింట్ డైరెక్టర్‌గా, 1990 నుంచి తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి 1992లో రిటైర్డు అయ్యారు. 1992 నుంచి 1994 వరకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఢిల్లీలో పనిచేశారు. 1994లో యోగివేమన యూనివర్సిటీ సీసీ మెంబర్‌గా రెండేళ్లు కొనసాగారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితంగా ఈయన కొనసాగేవారు. ఈయన మృతదేహానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య శ్మశానవాటికలో సీవీఎన్ సుబ్బారెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.